

రాజకీయాల్లో సరికొత్త మలుపు

- 2న డీపీఐ ఆధ్వర్యంలో మద్యపాన నిర్మూలన మహానాడు
- అన్నాడీఎంకేకు ఆహ్వానం
- అది వారి వ్యక్తిగత నిర్ణయం: డీఎంకే
- అధిష్ఠానానిదే నిర్ణయం: మాజీ మంత్రి జయకుమార్



మహానాడు పోస్టర్ ఆవిష్కరిస్తున్న తిరుమావళవన్

పెరంబూర్, సెప్టెంబరు 10: రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త మలుపునకు బాటలు పడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం డీఎంకే కూటమిలో వున్న డీపీఐ అనుబంధ సంస్థ 'మగళీర్ విడుదలై ఇయక్కం' ఆధ్వర్యంలో అక్టోబరు 2వ తేదీ జరుగనున్న మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలన మహానాడుకు రావాలంటూ ప్రతిపక్ష అన్నాడీఎంకేకు ఆహ్వానం పంపడం సంచలనం రేపుతోంది. కళ్లకుర్చి జిల్లాలో జరుగనున్న ఈ మహానాడుకు మద్యపాన నిర్మూలన ఆశించే పార్టీలన్నీ తరలిరావాలని, ప్రతిపక్ష అన్నాడీఎంకే కూడా చేరవచ్చని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ పిలుపునిచ్చారు. అశోక్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో 2006-24 మధ్య కాలంలో కల్తీ సారా తాగి 1,589 మంది మృత్యువాతపడ్డారని తెలిపారు. మరక్కాణం సమీపంలో గత ఏడాది 14 మంది మృతిచెందిన ఘటన రాష్ట్రాన్ని కుదిపివేసిందన్నారు. దాని తరువాత కళ్లకుర్చిలో 68 మంది కల్తీసారాకు బలయ్యారని గుర్తుచేశారు. బాధితులను ఓదార్చేందుకు వెళ్లిన సమయంలో, ప్రభుత్వ పరిహారం వద్దని, మద్యం దుకాణాలు మూసివేస్తే చాలని వారు కోరారన్నారు. వారి కోరిక మేరకు తమ పార్టీ ఆధ్వర్యంలో మద్యపాన నిర్మూలన మహానాడు నిర్వహించనున్నామని తెలిపారు. 2016 డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో మద్యం దుకాణాలు విడతల వారీగా మూసివేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. మద్యనిషేధంపై అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉండగా, మద్యం దుకాణాల మూసివేతకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. మద్యం దుకాణాల మూసివేతపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మద్యం విక్రయాల ద్వారా రూ.45,000 కోట్ల ఆదాయం వస్తున్నా, పునరావాస కేంద్రాలు ఎందుకు ఏర్పాటుచేయలేదని ప్రశ్నించారు. ప్రతి ఆసుపత్రిలో 'డీ అడిక్షన్' సెంటర్లు ఏర్పాటుచేసేలా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే సంపూర్ణ మద్యనిషేధ విధానానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. మహానాడుకు ఎన్నికలతో సంబంధం లేదని తెలిపారు. తమ పార్టీ రాజకీయ విధానం, స్థానం పూర్తిగా భిన్నంగా ఉంటుందన్నారు. ఈ మహానాడుకు పలు నిబంధనలు విధిస్తూ అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కొత్త పార్టీ ప్రారంభించిన నటుడు విజయ్‌కు ఈ సందర్భంగా తిరుమావళవన్ శుభాకాంక్షలు తెలిపారు.

వ్యక్తిగత నిర్ణయం: మంత్రి ఉదయనిధి

డీపీఐ నిర్వహిస్తున్న మద్యపాన నిషేధ మహానాడుకు అన్నాడీఎంకేను ఆహ్వానించడంపై డీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు, రాష్ట్ర ఉదయనిధి స్పందించారు. శివగంగలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకేను ఆహ్వానించడమనేది డీపీఐ వారి సొంత నిర్ణయమని వ్యాఖ్యానించారు.

పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుంది: మాజీ మంత్రి జయకుమార్

మద్యపాన నిర్మూలన మహానాడులో పాల్గొనాలని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ ఆహ్వానం పలకడంపై అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ స్పందిస్తూ... సమాజాభివృద్ధికి మద్యం అడ్డుగోడగా ఉందని, డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో సంపూర్ణ మద్యనిషేధం అమలుచేస్తామని ప్రకటించిందన్నారు. అధికారం చేపట్టిన స్టాలిన్, మద్యం ద్వారా ఆదాయం రూ.35 వేల నుంచి రూ.42 వేలకు పెంచారన్నారు. ఈ చర్యలు కూటమి పార్టీలకు నచ్చలేదని, అందువల్లే తిరుమావళవన్ గళం విప్పారన్నారు. ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలపై పోరాడే అన్నాడీఎంకే ఈ మహానాడులో పాల్గొనే విషయాన్ని పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని జయకుమార్ తెలిపారు.



ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న జాబిల్ సంస్థ ప్రతినిధులు

మరిన్ని పరిశ్రమలు

- తిరుచ్చిలో రూ.2వేల కోట్లతో 'జాబిల్' ఫ్యాక్టరీ
- రాక్వెల్ ఆటోమేషన్ పెట్టుబడి రూ.666 కోట్లు
- సీఎం స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందాలు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయి. తిరుచ్చిలో రూ.2వేల కోట్ల పెట్టుబడులతో 5వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా జాబిల్ సంస్థ తిరుచ్చిలో కర్మాగారం నెలకొల్పనుంది. విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ చికాగో నగరంలో సోమవారం రాత్రి జాబిల్ కంపెనీ, రాక్వెల్ ఆటోమేషన్, ఆటోడెస్క్ సంస్థల ప్రతినిధులతో ఆర్థికపరంగా ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆ మూడు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయి. ఆ మేరకు స్టాలిన్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాయి. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, చికాగో నగరాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటివరకూ చేసిన పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 14 కంపెనీలతో రూ.4350 కోట్లతో కొత్త కర్మాగారాలు ఏర్పాటుకు, ప్రస్తుతమున్న కర్మాగారాల్లో విస్తరణ కార్యక్రమాలు చేపట్టేందుకు అనువుగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తాజాగా సోమవారం రాత్రి జాబిల్ ఇన్‌కార్పొరేషన్, రాక్వెల్ ఆటోమేషన్, ఆటోడెస్క్ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తొలుత ఆపిల్, సిస్కో, హెచ్‌పీ, డెల్ వంటి ప్రముఖ సంస్థలకు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సేవలను అందించడంలో పేరుగాంచిన జాబిల్ ఇన్‌కార్పొరేషన్ సంస్థ చైనా, భారత దేశం, మలేషియా, మెక్సికో, సింగపూరు, అమెరికాలోని పలు సంస్థలకు సేవలందిస్తోంది. ఈ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మేడ్ క్రౌలీ, సీనియర్ డైరెక్టర్ నిత్యా సిన్హా, ప్రతినిధి బీజే ఫేరన్‌కాఫ్ ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలకు అనువుగా ఉన్న నగరాల వివరాలను, ప్రభుత్వం కొత్త పరిశ్రమల కోసం కల్పిస్తున్న సదుపాయాలను స్టాలిన్ వివరించారు. ఫలితంగా ఆ సంస్థ తిరుచ్చిలో రూ.2వేల కోట్ల పెట్టుబడితో కొత్త కర్మాగారం నెలకొల్పడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

రాక్వెల్ పెట్టుబడి రూ.666 కోట్లు...

అమెరికాలోని విస్కాన్‌సిన్ సమీపం మిల్‌వాక్కీలో కార్పొరేట్ ప్రధాన కార్యాలయం కలిగిన ఇండస్ట్రియల్ ఆటోమేషన్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఖ్యాతిగడించిన రాక్వెల్ ఆటోమేషన్ రాష్ట్రంలో రూ.666 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. దీంతో కాంచీపురంలోని ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తి కర్మాగారంలో విస్తరణ కార్యకలాపాలను నిర్వహించేలా స్టాలిన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో రాక్వెల్ ఆటోమేషన్ ఛైర్మన్ బ్లేక్ మోరెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాబర్ట్ బట్లర్‌మోర్, వైస్ ఛైర్మన్ ఎడ్వర్ మోర్లాండ్, డైరెక్టర్ ముత్తుకుమరన్ పిచ్చై తదితరులు పాల్గొన్నారు.

ఆటోడెస్క్‌తో ఒప్పందం...

అమెరికాలోని కట్టడ కళ, ఇంజనీరింగ్ భవననిర్మాణాలు, ఉత్పత్తి రంగాలు, ప్రసార మాధ్యమాలు, విద్యా, వినోదాత్మక పరిశ్రమలకు సాఫ్ట్‌వేర్ సమకూర్చటంలో ప్రసిద్ధి చెందిన ఆటోడెస్క్ కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగుల యువతకు ప్రతిభాపాటవాల పెంపుపై శిక్షణ కార్యక్రమాలు, ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్‌ల్లో పోటీతత్వాన్ని పెంచేదిశగా అనువైన సాఫ్ట్‌వేర్‌లను అందించనుంది. ఈ కార్యక్రమంలో ఆటోడెస్క్ సీఈఓ జెబ్ కిండర్, వైస్ ఛైర్మన్ కెన్‌పూ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య శాఖల కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు తదితరులు హాజరయ్యారు.

హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు



- మరో ఐదుగురు శాశ్వత జడ్జీలు
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. ప్రస్తుతం న్యాయాధికారులుగా వున్న ముగ్గురిని హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం జిల్లా న్యాయాధికారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.పూర్ణిమ, డాక్టర్ అగస్టీన్ దేవదాస్ మరియా, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా వ్యవహరిస్తున్న ఎం.జ్యోతిరామన్‌లను హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని సిఫారసు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏప్రిల్ 23న ఇచ్చిన సిఫారసులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ ఇచ్చిన లేఖలను పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు సిఫారసు చేస్తున్నట్లు పేర్కొంది. కాగా ఈ సిఫారసులను పరిశీలించిన కేంద్రం.. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతుంది. అక్కడ ఆమోదం లభించాక ఆ ముగ్గురూ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు.

ఐదుగురు శాశ్వత న్యాయమూర్తులు

మద్రాస్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పని చేస్తున్న జస్టిస్ లక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరి, జస్టిస్ పిళ్లైపాక్కం బహుకుటుంబి బాలాజీ, జస్టిస్ కందస్వామి కుళందైవేలు రామకృష్ణన్, జస్టిస్ రామచంద్రన్ కలైమతి, జస్టిస్ కె.గోవిందరాజన్ తిలకవతిలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కూడా సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసింది. 75 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన మద్రాస్ హైకోర్టులో 62 మంది న్యాయమూర్తులు మాత్రమే వున్నారు. మరో 13 ఖాళీలు భర్తీ కావాల్సివుంది.

చిరు వ్యాపారులకు భరోసా



- నగరంలో నాలుగు చోట్ల దుకాణ సముదాయాలు
- నిర్ణయించిన చెన్నై కార్పొరేషన్

అడయార్, సెప్టెంబరు 10: చెన్నై మహానగరంలోని నాలుగు ప్రాంతాల్లో చిన్న దుకాణాల భవన సముదాయాలు (స్మాల్ షాప్స్ కాంప్లెక్స్) నిర్మించాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. నగరంలో నానాటికీ జనసాంద్రత పెరిగిపోతోంది. దీని కారణంగా స్థలాభావం ఏర్పడుతోంది. అదేసమయంలో కొత్తగా ఏర్పాటయ్యే చిన్న దుకాణాల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. దీంతో వీధుల్లో తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. ఈ సమస్య పరిష్కారం చూపిస్తూ చిరు వ్యాపారులకు మేలు చేసేలా నగరంలో నాలుగు ప్రధాన ప్రాంతాల్లో స్మాల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. తొలి దశలో ఉత్తర చెన్నై, ఎంకేబీ నగర్‌లోని వెస్ట్ అవెన్యూ రోడ్డు, ఎగ్మోర్ లోని పాంథియన్ లేన్, అంబత్తూరులోని పార్క్ రోడ్డు, బీసెంట్ నగర్‌లో ఉన్న సెకండ్ అవెన్యూలో ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. ఈ దుకాణాల్లో గృహ అవసరాలు, జౌళి, ఫ్యాషన్, సౌందర్య ఉత్పత్తులు, ఎలక్ట్రిక్ వస్తు పరికరాలు విక్రయానికి అందుబాటులో ఉంచుతారు. ప్రతి దుకాణానికి ఐదడుగుల గ్యాప్ ఉంటుంది. ఈ దుకాణాలకు పక్కాగా అనుమతులు మంజూరు చేస్తారు. ఇదే విషయంపై కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారి మాట్లాడుతూ.. 'ఈ భవన సముదాయాల్లో వీధి వ్యాపారులకు షాపులు కేటాయించి, ప్రతి వ్యాపారస్తుడికి అన్ని అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో కేటాయించే జోన్ దుకాణ నంబర్లను అతిక్రమించే వ్యాపారులపై చర్యలు కూడా తీసుకుంటామన్నారు. పాంథియన్ లేన్‌లో నిర్మించే భవన సముదాయంలో బెడ్‌షీట్లు, కర్టెన్లతో పాటు మహిళలకు అవసరమైన సౌందర్య ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ 50కి పైగా దుకాణాలను వీధి వ్యాపారులకు కేటాయిస్తామన్నారు. బీసెంట్ నగర్ రెండో అవెన్యూలో నెలకొల్పే షాపింగ్ కాంప్లెక్స్‌లో అన్ని రకాల వస్తువులను 45 దుకాణాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఇందులో ఫుడ్ కోర్టులతో పాటు ఆభరణ షాపులు, ఫ్రూట్ షాపులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి దుకాణంలో దుకాణంలో భద్రతా చర్యలు పాటిస్తామన్నారు. రక్షణా చర్యలు అధిగమించే వ్యాపారులకు అపరాధం విధిస్తామన్నారు. ప్రతి వీధిలో చిల్లర వ్యాపారాల షాపులను తగ్గించాలన్న ఏకైక లక్ష్యంతో ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని వెల్లడించారు.



వాణిజ్య సంఘాల నేత వెల్లయన్ మృతి



వెల్లయన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, సెప్టెంబరు 10 : రాష్ట్ర వాణిజ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెల్లయన్ (76) మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా ఆయన శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నెల 3న ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావటంతో అమింజికరైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. సోమవారం మధ్యాహ్నం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో అత్యవసర చికిత్సా విభాగానికి తరలించి వైద్య నిపుణులు ఆయనకు అత్యవసర చికిత్సలందించారు. మంగళవారం ఉదయం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు వైద్యులు ప్రకటించారు. చివరకు చికిత్స ఫలించక మంగళవారం మధ్యాహ్నం ఆయన తుదిశ్వాస విడిచారు.

చెన్నై - మన్నార్గుడి మధ్య వందేభారత్ రైలు

- సాధ్యాసాధ్యాలపై పరిశీలన

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి డెల్టా జిల్లాలను కలుపుతూ మన్నార్గుడికి వందేభారత్ రైలును నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. ఆ మేరకు సాధ్యాసాధ్యాలను దక్షిణ రైల్వే ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం నగరం నుంచి తిరునల్వేలి, నాగర్‌కోవిల్, కోయంబత్తూరు, మైసూరు, విజయవాడ నగరాలకు వందేభారత్ రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో డెల్టా జిల్లాలను కలిపేలా కడలూరు, మైలాడుదురై, తంజావూరు మీదుగా మన్నార్గుడికి వందేభారత్ రైలు నడపాలని ప్రయాణికుల సంఘం నాయకులు దక్షిణ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. నగరం నుంచి ప్రస్తుతం మన్నార్గుడి, తంజావూరుకు తక్కువ సంఖ్యలోనే రైళ్లను నడుపుతున్నారు. ఈ మార్గంలో వేలాంకన్ని, తిరువారూరు, కుంభకోణం, మైలాడుదురై, చిదంబరం తదితర ఆధ్యాత్మిక నగరాలు, కడలూరు వంటి వాణిజ్య నగరాలు కూడా ఉన్నాయి. చెన్నై లేదా బెంగళూరు నుంచి డెల్టా జిల్లాల మీదుగా మన్నార్గుడి లేదా పుదుచ్చేరికి వందేభారత్ రైలు నడపాలని ప్రజా ప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించినట్లు రైలు ప్రయాణికుల సంఘం నిర్వాహకులు తెలిపారు. దీంతో ఎగ్మూరు నుంచి మైలాడుదురై, తంజావూరు మీదుగా మన్నార్గుడికి వందేభారత్ సేవలు ప్రారంభించడానికి ప్రస్తుతం జోరుగా సర్వేలు జరుగుతున్నాయని దక్షిణ రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ రైలు సేవలను ప్రారంభించేందుకు గల సాధ్యాసాధ్యాలపై పరిశీలిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సర్వే, పరిశీలన పూర్తి చేసి రైల్వే బోర్డుకు నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మన్నార్గుడికి వందేభారత్ రైలు సేవలు ప్రారంభించే విషయమై త్వరలో అధికారిక ప్రకటన కూడా జారీ అవుతుందని చెబుతున్నారు.

ప్రాథమిక పాఠశాలల టీచర్ల సమ్మె



ఆందోళనలో పాల్గొన్న టీచర్లు

ప్యారీస్, సెప్టెంబరు 10: పాత పింఛన్ పథకం అమలుపరచాలి, పార్ట్ టైం టీచర్ల వేతన విధానం రద్దు చేయాలి తదితర 31 డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల టీచర్లు మంగళవారం విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ప్రాథమిక విద్య టీచర్ల సమాఖ్య - ఉమ్మడి కార్యాచరణ కమిటీ (టిటో-జాక్) జూలై 30, ఈ నెల 6వ తేదీల్లో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, డైరెక్టర్, ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్లతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. పాత పింఛన్ విధానం అమలుపరచాలి, ఉన్నత విద్య చదువుకున్న వారికి పదోన్నతి, సమాన వేతనం, పదోన్నతి అవకాశాలను అడ్డుకొనే విధంగా ప్రభుత్వం జారీచేసిన జీవో 243ను రద్దు చేయాలి తదితర న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరింపజేయకుండా గత 15 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చూపుతోందని, అందువల్లే నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు టిటో-జాక్ తెలిపింది. ఆ మేరకు మంగళవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న టీచర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మె ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న పాఠశాలల టీచర్లు విధులకు హాజరుకాలేదు. ఈ నెల 29 నుంచి రాజధాని నగరంలో వరుసగా మూడు రోజులు ఆందోళనలు చేపట్టనున్నట్లు టిటో-జాక్ నిర్వాహకులు ప్రకటించారు. ఇదిలా ఉండగా, దిండుగల్ జిల్లాలోని పాఠశాలలను రెండు రోజులుగా పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ మంగళవారం కొడైకెనాల్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల టీచర్ల కోరికలన్నింటినీ పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ఆందోళన చేపట్టిన టీచర్లను చర్చలకు ఆహ్వానిస్తామని మంత్రి తెలిపారు.

సమాచార ధ్వని

14న రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 10: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 19 మండలాల్లో ఈ నెల 14వ తేది రేషన్ గ్రీవెన్స్ జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగనున్న ఈ శిబిరంలో ప్రజలు పాల్గొని, రేషన్ కార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు, చిరునామా మార్పు, సెల్‌ఫోన్ నెంబరు మార్పు, రేషన్ దుకాణాల్లో అందించే సరుకుల నాణ్యత తదితరాలపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని ఆహార వస్తువుల సరఫరా, వినియోగదారుల భద్రతా శాఖ డైరెక్టర్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పాఠశాల పనిదినాల తగ్గింపు

పెరంబూర్, సెప్టెంబరు 10: రాష్ట్రంలో ప్రస్తుతం విద్యా సంవత్సరం (2024-25)లో పది రోజుల పనిదినాలు తగ్గిస్తూ పాఠశాల విద్యాశాఖ కొత్త టైంటేబుల్ విడుదల చేసింది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 1 నుంచి ప్లస్ టూ తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల పనిదినాలు, పరీక్షలు, సెలవులు తదితర వివరాలతో కూడిన టైం టేబుల్‌ను 2018 నుంచి వెలువరిస్తున్నారు. ఆ ప్రకారం, 6 నుంచి 10వ తరగతి వరకు త్రైమాసిక పరీక్షలు ఈ నెల 20న ప్రారంభమై 27వ తేది వరకు జరుగనున్నాయి. అలాగే, ప్లస్ వన్, ప్లస్ టూ తరగతులకు ఈ నెల 19 నుంచి 27వ తేది వరకు పరీక్షలు నిర్వహించి, 28 నుంచి అక్టోబరు 2వ తేది వరకు సెలవులు ప్రకటించారు. సాధారణంగా ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలల పనిదినాలు 210 ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరం 220కి పెంచారు. ఈ నేపథ్యంలో, పనిదినాలు తగ్గించాలని కోరుతూ టీచర్లు, విద్యావేత్తలు చేసిన సూచనలపై స్పందించిన విద్యాశాఖ, ప్రస్తుత విద్యా సంవత్సరం 10 రోజులు పనిదినాలు తగ్గిస్తూ కొత్త టైంటేబుల్ విడుదల చేసింది.

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ

వేలూరు, సెప్టెంబరు 10: యూపీఎస్సీ సహా పలు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి విడుదల చేసిన ప్రకటనలో... డా.అంబేద్కర్ అకాడమీ, చెన్నై శిక్షణ సంస్థ సహకారంతో వంద మంది ఆదిద్రావిడులు, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఏడాది పాటు శిక్షణ అందించనున్నారు. డిగ్రీ ఉత్తీర్ణులై 21 నుంచి 36 ఏళ్లలోపున్న వారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. ఏడాది పాటు జరిగే శిక్షణ కాలంలో ఉచిత బస, భోజన వసతి కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన వారు 'థాడ్కో' వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 10: ముస్లిం పవిత్ర స్థలమైన హజ్ యాత్రకు దరఖాస్తు గడువు ఈ నెల 23వ తేది వరకు పొడిగించినట్లు బీసీ, ఎంబీసీ, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు టీటీటీ.జ్చిఛొారు ఝఝ్ఞ.జౌ్ర.జీ అనే వెబ్‌సైట్, అండ్రాయిడ్ మొబైల్ యాప్ ఏఅఐ ఖ్ఖిఞఈఏఅ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. ఈ నెల 23వ తేదీకి ముందు పొంది, 2026 జనవరి 1 తేది వరకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ కలిగిన వారు, మొదటి, ఆఖరు పేజీలు దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి. అలాగే, క్యాన్సిల్ చెక్, ఐఎఫ్ఎస్సీ కోడ్‌తో బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు తదితరాలు కూడా జతచేయాల్సి ఉంది. మరిన్ని వివరాలకు అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

రూ.1.51 లక్షలకు వినాయకుడి చేతిలోని లడ్డూ వేలం

పెరంబూర్, సెప్టెంబరు 10: మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలోని మలైప్పడి కొండ గ్రామంలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహం ఏర్పాటుచేశారు. ఈ విగ్రహానికి నాలుగు రోజులుగా గ్రామస్తులు పూజలు నిర్వహిస్తున్నారు. వినాయకుడి విగ్రహంలోని చేతిలో ఉంచిన లడ్డూ వేలం సోమవారం సాయంత్రం జరిగింది. అదే గ్రామానికి చెందిన మురుకుల వ్యాపారి ముక్కన్ వేలంలో పాల్గొని, రూ.1.51 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్నారు.

కళాశాలల్లో 'యాంటీ డ్రగ్ క్లబ్'ల ఏర్పాటు

పెరంబూర్, సెప్టెంబరు 10: కళాశాలల్లో 'యాంటీ డ్రగ్ క్లబ్'లు ఏర్పాటుచేయాలని ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ కళాశాల యాజమాన్యాలను ఆదేశించారు. తిరుముల్లైవాయల్ ఎస్ఎం నగర్ పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలోని 60 కళాశాలల నిర్వాహకులతో కమిషనర్ శంకర్ సమావేశమయ్యాయి. మాదకద్రవ్యాలు తీసుకోవడం ద్వారా కలిగే నష్టాలు, అనారోగ్యం తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఈ యాంటీ డ్రగ్ క్లబ్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ నెల 20వ తేది లోపు అన్ని కళాశాలల్లో ఈ క్లబ్‌లు ఏర్పాటుచేయడంతో పాటు, ప్రతినెలా సమావేశం నిర్వహించాలని కమిషనర్ సూచించారు.

సభ్యత్వ నమోదుపై 13న బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం ఈ నెల 13న జరుగనుంది. పార్టీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా, సీనియర్ నేతలు పొన్ రాధాకృష్ణన్, వానతి శ్రీనివాసన్, వీపీ దురైసామి, కరు నాగరాజన్, కరుప్ప మురుగానందం, కాత్యాయిని తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారు. జాతీయ స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జరుగుతున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో ఈ నెలాఖరులోగా 50లక్షల మందికి సభ్యత్వం కల్పించేలా తీసుకోవాల్సిన చర్యలు గురించి ఈ సమావేశంలో సమగ్రంగా చర్చలు జరుపనున్నారు. వచ్చే అక్టోబర్ 15 లోగా 75లక్షల మందికి పార్టీ సభ్యత్వం కల్పించడమే తమ లక్ష్యమని సమన్వయకమిటీ అధ్యక్షుడు హెచ్ రాజా ఇదివరకే ప్రకటించారు.

ప్రైవేటు పాఠశాలల కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్

పెరంబూర్, సెప్టెంబరు 10: ప్రైవేటు పాఠశాలలకు నిర్ణీత కాలానికి మాత్రమే అంగీకారం అందించే కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌కు సంబంధించి నాలుగు వారాల్లో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది. ప్రైవేటు పాఠశాలల చట్టంలో లేని కొత్త నిబంధనలను ప్రభుత్వం అమలుచేస్తుందని పిటిషన్ దారుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.



వేలూరు జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాలకు చెందిన ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను మంగళవారం విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బలక్ష్మి

యువకుల మృతిపై సీఎం దిగ్ర్భాంతి



మృతులకు నివాళులర్పిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

పెరంబూర్, సెప్టెంబరు 10: తంజావూరు సమీపంలోని కొల్లిడం నదిలో స్నానాలకు వెళ్లి నీటమునిగిన ఐదుగురి యువకుల మృతిపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్ నెహ్రూ పార్క్ సమీపంలోని తమిళనాడు నగరప్రాంత జీవనాభివృద్ధి సంస్థ క్వార్టర్స్‌కు చెందిన కిషోర్ (20), కలైవేందన్ (19), ఆంటో (21), ఫ్రాంక్లిన్ (23), మనోహర్ (19) ఈ నెల 8న తంజావూరు జిల్లా తిరుకాట్టుపల్లిలో ఉన్న మాత ఆలయానికి వెళ్లారు. సమీపంలోని కొల్లిడం నదిలో స్నానాలు చేస్తూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగి మృతిచెందారు. ఐదుగురు యువకుల మృతి తనను కలిచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి తలా రూ.2 లక్షలు అందజేయనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. కాగా మంగళవారం దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు మృతదేహాలకు నివాళులర్పించి, కుటుంబీకులను ఓదార్చారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు అందించారు.

వాషింగ్ మెషీన్‌లో మూడేళ్ల బాలుడి హత్య

● తిరునల్వేలి జిల్లాలో ఘోరం

పెరంబూర్, సెప్టెంబరు 10: వాషింగ్ మెషీన్‌లో వేసి మూడేళ్ల బాలుడిని హతమార్చిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా రాధాపురం సమీపం ఆత్తుకుర్చి గ్రామానికి చెందిన విఘ్నేష్-రమ్య దంపతులకు సంజయ్ (3) అనే కుమారుడున్నాడు. సంజయ్ అదే ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రానికి వెళుతుంటాడు. వీరింటికి ఎదురుగా నివసిస్తున్న తంగమ్మాళ్ (49) తరచూ వీరితో గొడవ పడుతుండేదని సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అంగన్వాడీ కేంద్రానికి పంపేందుకు సంజయ్ కోసం వెతకగా కనిపించలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు రాధాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆత్తుకుర్చి గ్రామానికి చేరుకున్న పోలీసులు గ్రామంలోని ఇళ్లలో గాలించారు. తన ఇంట్లోకి పోలీసులు రావడాన్ని గమనించిన తంగమ్మాళ్ ఇంటి వెనుకవైపున్న తలుపు గుండా తప్పించుకొనేందుకు యత్నించగా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను విచారించగా, సంజయ్‌ను మూటలో కట్టి వాషింగ్ మెషీన్‌లో వేసి మూత వేసినట్లు తెలిపింది. దీంతో పోలీసులు వాషింగ్ మెషీన్‌ను పరిశీలించగా సంజయ్ మృతి చెంది ఉండడం గుర్తించారు. తంగమ్మాళ్ కుమారుడు కొద్దిరోజుల క్రితం మృతిచెందడంతో ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోందని, కుమారుడి అంత్యక్రియలకు విఘ్నేష్ కుటుంబం హాజరుకాకపోవడంతో, కుమారుడి మృతికి వారే కారణమని తంగమ్మాళ్ భావించింది. దీంతో, సోమవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న సంజయ్‌ను ఇంట్లోకి తీసుకెళ్లి బస్తాలో కట్టివేసి వాషింగ్‌మెషీన్‌లో వేసి మూతవేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు తంగమ్మాళ్‌ను విచారిస్తున్నారు.



బాలుడి ప్రాణం తీసిన వాషింగ్ మెషీన్

ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి

● శివకాశి డీఎంకే శాఖ తీర్మానం

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరుతూ శివకాశి మహానగర డీఎంకే శాఖ ఓ తీర్మానం ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ ఎన్నికల్లో పార్టీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు డీఎంకే నగర శాఖ సమావేశం ఆ శాఖ అధ్యక్షుడు మాణిక్యం అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి ఉదయసూర్యన్, శివకాశి మేయర్ సంగీత, డీఎంకే వాణిజ్య శాఖ ఉపాధ్యక్షుడు వనరాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల్లో దేశంలోనే అగ్రస్థానం

● రాష్ట్రానికి కేంద్ర మంత్రి ప్రశంస

అడయార్, సెప్టెంబరు 10: అనేక సంస్కరణల ఫలితంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించడంలో తమిళనాడు దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది. ఇతర రాష్ట్రాల గణాంకాలతో పోల్చి చూడగా, తమిళనాడు మొదటి స్థానంలో ఉందని గుర్తు చేస్తూ రాష్ట్రాన్ని అభినందించింది. ఇదే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. 2021లో ముఖ్యమంత్రిగా ఎంకే స్టాలిన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, ఉన్నత విద్యలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. ఇందులో భాగంగా ప్రొఫెసర్ కె.అన్బళగన్ పాఠశాలల అభివృద్ధి పథకం, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, విద్యార్థులను ఉన్నత విద్యలో ప్రోత్సహించేలా నాన్ ముదల్వన్ పథకం ఇలా అనేక పథకాలను ప్రవేశపెడుతూ విద్యా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేలా ప్రోత్సహిస్తున్నారని తెలిపింది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న కేంద్ర విద్యాశాఖ ఇతర రాష్ట్రాల విద్యాశాఖల గణాంకాతలతో పోల్చి, తమిళనాడు విద్యా రంగం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొంది.

ఇళ్ల ముందు 'నో పార్కింగ్' బోర్డు కుదరదు



పెరంబూర్, సెప్టెంబరు 10: నగరంలోని ఇళ్ల ముందు నో పార్కింగ్ బోర్డుల ఏర్పాటుపై మద్రాసు హైకోర్టు నిషేధం విధించింది. వాహనాల పార్కింగ్ నియంత్రణకు బహిరంగ ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డులు పెట్టడం, కంచె ఏర్పాటు, ఇసుక బస్తాలు ఏర్పాటుచేయడం వంటివాటిపై ప్రైవేటు భవనాల యజమానులకు సలహా ఇవ్వాలని కోరుతూ నందకుమార్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం.. నగరంలోని ఇళ్ల ముందు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటుచేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీసుశాఖకు ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, ఈ విషయమై మార్గదర్శకాలు రూపొందించి, పత్రికలు, మీడియా, వెబ్‌సైట్ల ద్వారా ప్రకటించాలని పోలీసు శాఖను ఆదేశించింది.

పాలు చిల్లింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



మొక్క నాటుతున్న మంత్రి మనోతంగరాజ్

వేలూరు, సెప్టెంబరు 10: జిల్లాలోని ఆనెకట్టు డివిజన్ పల్లాండరామమ్ గ్రామంలో రూ.17 లక్షలతో ఏర్పాటుచేసిన పాలు చిల్లింగ్ కేంద్రాన్ని మంగళవారం పశుసంవర్థక శాఖ మంత్రి మనో తంగరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తి, పాల డైరీల అభివృద్ధి శాఖ డైరెక్టర్ డా.వినీత్, ఆనెకట్టు ఎమ్మెల్యే నందకుమార్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, యూనియన్ కమిటీ ఉపాధ్యక్షులు చిత్రకుమార్, ఆవిన్ జనరల్ మేనేజర్ ఇళంగోవన్, ఉప రిజిస్ట్రార్ గోపి సహా పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కేంద్రం ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు.

విజయదశమి, దీపావళి సందర్భంగా 20 శాతం విక్రయాల పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 10: విజయదశమి, దీపావళి పండుగల సందర్భంగా 20 శాతం విక్రయాలు పెంచాలని ఆవిన్ సంస్థ లక్ష్యంగా నిర్ధేశించింది. ప్రభుత్వ రంగ సంస్థ ఆవిన్, పాల ఉత్పత్తిదారుల నుంచి రోజుకు సుమారు 34 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేస్తోంది. పాల విక్రయాల అనంతరం మిగిలిన పాలతో వెన్న, నెయ్యి, పెరుగు, పాలకోవా సహా 200 రకాల ఉత్పత్తులు తయారుచేసి ఆవిన్ పార్లర్లు, చిల్లర దుకాణాల ద్వారా విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో, వచ్చే నెలల్లో రానున్న విజయదశమి, దీపావళి పండుగల సందర్భంగా పాల ఉత్పత్తులు 20 నుంచి 30 శాతం పెంచాలని ఆవిన్ లక్ష్యాన్ని నిర్ధేశించింది.

పార్క్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, సెప్టెంబరు 10: ఆనెకట్టు నియోజకవర్గం పల్లికొండ పంచాయతీలో కొత్తగా భారతిదాసన్ పార్క్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ జరిగింది. కార్యక్రమంలో డీఎంకే జిల్లా సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, తూర్పు యూనియన్ సెక్రటరీ పాండ్యన్, పంచాయతి సెక్రటరీ జాగీర్‌హుస్సేన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు భాస్కరన్, పంచాయతి అధ్యక్షులు సుప్రియ, కౌన్సిలర్లు, పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐదు లక్షల విత్తనపు బంతులు సిద్ధం



విత్తనపు బంతులు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, పాఠశాల నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 10: 'పశుమై వేలూరు' పథకంలో 5 లక్షల విత్తనపు బంతులు విసిరే కార్యక్రమాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ఆక్సీలియం కళాశాలలో జరిగిన కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ మేరీజోస్ఫిన్ రాణి, కళాశాల ప్రిన్సిపాల్ ఆరోగ్య జయశీలి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేలూరు చుట్టూ ఉన్న కొండలు, 247 పంచాయతీల్లో ఈ మొక్కలు నాటనున్నామన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకొనేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

టాస్మాక్ మద్యం దుకాణం కావాలి..!

● కలెక్టర్‌కు గ్రామస్తుల వినతిపత్రం



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన గ్రామస్తులు

పెరంబూర్, సెప్టెంబరు 10: తమ గ్రామంలో టాస్మాక్ మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ 50 మందికి పైగా గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కళ్లకుర్చి సమీపంలోని సిరుమంగళం గ్రామానికి చెందిన ప్రజలు మద్యం కోసం 10 కి.మీ దూరంలోని కనియమూరు, ఆడరీ, సిరుపాక్కం, విరుగావూర్ తదితర ప్రాంతాల్లో టాస్మాక్ దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటుచేయాలని కోరుతూ సోమవారం ఆ గ్రామానికి చెందిన వారు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మొదట వారు గ్రామంలో టాస్మాక్ దుకాణం ఏర్పాటుచేయాలంటూ చేసిన నినాదాలతో కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు, సమస్యలు తెలిపేందుకు వచ్చిన ప్రజలు దిగ్ర్భాంతి చెందారు.

వైద్యకోర్సుల అడ్మిషన్ కౌన్సెలింగ్

● అఖిల భారత కోటాలో 75 శాతం సీట్లు ఖాళీ

పెరంబూర్,సెప్టెంబరు10:మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో, అఖిల భారత కోటా సీట్లలో 75 శాతం ఎంబీబీఎస్ సీట్లు భర్తీకాలేదు. అఖిల భారత కోటా కింద 7,918 ఎంబీబీఎస్ సీట్లుండగా, మొదటి విడత కౌన్సెలింగ్‌లో 2,150 సీట్లు భర్తీ అయ్యాయి. అఖిల భాతర కోటా కింద రాష్ట్రంలోని 771 ఎంబీబీఎస్ సీట్లలో 597సీట్లు ఖాళీ ఉన్నాయి. రాష్ట్రంలోని ఎంబీబీఎస్ కోర్సులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 9,200 సీట్లు, బీడీఎస్ కోర్సుల్లో 2,150 సీట్లున్నాయి. రాష్ట్రంలోని 37 ప్రభుత్వ వైద్యకళాశాలల్లో అఖిల భారత కోటాలో మొత్తం 771 సీట్లుండగా, 175 సీట్లు మాత్రమే భర్తీకాగా, 596 సీట్లున్నాయి. వీటిలో 137 సీట్లు వర్చువల్ ఖాళీలు. ఆ ప్రకారం, అఖిల భారత కోటాలో 22.7 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో అఖిల భారత కోటాలో 3,550 సీట్లలో 2,285 సీట్లు (64 శాతం)భర్తీ అయ్యాయి. దీంతో, రెండవ విడత కౌన్సెలింగ్‌లో పలువురికి సీట్లు పొందే అవకాశముంది.

క్రైం కార్నర్

CRIME CORNER

ఏర్కాడు ఘాట్ రోడ్డులో రక్షణ గోడను ఢీకొట్టిన బస్సు

● ప్రయాణికులకు తప్పిన ముప్పు

అడయార్, సెప్టెంబరు 10: ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడుకు విహార యాత్రకు వెళ్ళిన చెన్నై బస్సు ప్రమాదానికి గురైంది. ఏర్కాడు ఘాట్ రోడ్డులో రక్షణ గోడను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో ఈ బస్సులోని 40 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వినాయక చవితిని పురస్కరించుకుని చెన్నై నగరానికి చెందిన దాదాపు 40 మంది పిల్లలతో కలిసి ఒక బస్సులో ఏర్కాడుకు విహార యాత్రకు వెళ్ళారు. రెండు రోజుల పాటు ఏర్కాడులో విహరించిన వారు.. సోమవారం సాయంత్రం తిరిగి చెన్నైకు బయలుదేరారు. ఈ బస్సు ఏర్కాడు ఘాట్ రోడ్డు 14వ మలుపు వద్ద నియంత్రణ కోల్పోయి రక్షణ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం స్వల్పంగా దెబ్బతినగా, బస్సులోని 40 మంది పర్యాటకులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ మురుగేశన్‌ను పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కోవై ఫర్నీచర్ గోదాములో అగ్ని ప్రమాదం

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు చిన్నవేడంపట్టి సమీపంలోని సుబ్బునాయకన్ పుదూరులోని ఫర్నిచర్ గోదాములో మంగళవారం సాయంత్రం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో లక్షలాది రూపాయల మేర ఆస్తినష్టం సంభవించింది. పట్టుకోటకు చెందిన మూక్కయ్యన్ అనే వ్యక్తి చెందిన ఆ గోదాములో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బీరువాలు, బల్లలు, కుర్చీలు తదితర ఫర్నిచర్ సామగ్రి అంతా ఈ ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్‌తో వెళ్ళి గంటకు పైగా పోరాడి మంటలను ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వృద్ధుడిని మధ్యలో దించిన వ్యవహారం.... బస్ డ్రైవర్ డిస్మిస్, కండక్టర్ సస్పెన్షన్

ప్యారీస్, సెప్టెంబరు 10: నడుస్తున్న బస్సులో మరణించిన విషయం తెలియక వృద్ధుడిని మార్గమధ్యంలో దించి వెళ్లిన ప్రభుత్వ బస్సు డ్రైవర్ డిస్మిస్‌కు గురికాగా, కండక్టర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన బీమామండావి (60), ఆయన మనవళ్లు అశోక్‌కుమార్, గజిని విల్లుపురం జిల్లా విక్రవాండిలో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. వీరు సొంతూరు వెళ్లేందుకు ఈ నెల 6వ తేది రాత్రి విల్లుపురం కొత్త బస్టాండ్ నుంచి చెన్నై బయల్దేరిన ప్రభుత్వ బస్సు ఎక్కారు. ప్రయాణిస్తున్న సమయంలో బీమామండావి గుండెపోటుతో మరణించినట్లు తెలిసింది. దీంతో బస్సును ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా మృతుడి మనువళ్లు బస్సు కండక్టర్, డ్రైవర్లను కోరారు. అయితే అందుకు అంగీకరించకుండా, బీమామండావి మరణించిన విషయం తెలియక మార్గమధ్యంలోనే బస్సు నుంచి దింపేసి వెళ్లిపోయారు. ఈ సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం చూసిన చెంగల్పట్టు పోలీసులు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో, మానవత్వం లేకుండా వ్యవహరించిన సంబంధిత బస్సు డ్రైవర్ రామ్‌కుమార్‌ను డిస్మిస్ చేస్తూ, కండక్టర్ బసూల్ రెహ్మాన్‌ను సస్పెండ్ చేస్తూ విల్లుపురం ప్రభుత్వ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుణశేఖరన్ ఉత్తర్వులు జారీచేశారు.

న్యాయవాదుల భద్రతా చట్టాన్ని అమలుపరచాలి

● హైకోర్టులో కేసు

ప్యారీస్, సెప్టెంబరు 10: న్యాయవాదుల భద్రతా చట్టాన్ని రాష్ట్రంలో అమలుపరచాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో కేసు దాఖలైంది. తిరుముల్లైవాయల్‌కు చెందిన న్యాయవాది ఛార్లెస్ అలెగ్జాండర్ దాఖలుచేసిన పిటిషన్‌లో... 2008వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు 15 ఏళ్లలో మొత్తం 15,924 మంది న్యాయవాదులు కొత్తగా బార్ కౌన్సిల్‌లో తమ పేర్లు నమోదు చేసుకుని న్యాయవాదులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ఇందులో 2008వ సంవత్సరం ఎగ్మూర్ కోర్టు ప్రాంగణంలోనే ఓ న్యాయవాది దారుణహత్యకు గురైనట్లు, 2011లో సీనియర్ న్యాయవాది శంకర్ సుబ్బు కుమారుడు న్యాయవాది సతీష్‌కుమార్‌ను హత్యచేసిన కేసు విచారణ పెండింగ్‌లోనే ఉందని తెలిపారు. సైదాపేట కోర్టు ప్రాంగణంలో న్యాయవాది జైగణేశ్, తెన్‌కాశిలో అశోక్‌కుమార్, తూత్తుకుడిలో ముత్తుకుమార్, బీఎస్పీ అధ్యక్షుడు, న్యాయవాది ఆమ్‌స్ట్రాంగ్ సహా 20 మందికి పైగా న్యాయవాదులు హత్యకు గురయ్యారని పిటిషన్‌లో వివరించారు. ఈ కేసు త్వరలో విచారణకు వచ్చే అవకాశముందని హైకోర్టు వర్గాలు తెలిపాయి.

బస్సు వెళ్తుండగా లూజైన చక్రం

● డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికుల సురక్షితం



చక్రం సరిచేస్తున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 10: నాట్రాంపల్లి సమీపంలో వేగంగా వెళ్తున్న బస్సు చక్రంలో ఉన్న లోపాన్ని గుర్తించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. చెన్నై నుంచి బెంగళూరుకు 40 మంది ప్రయాణికులతో సోమవారం సాయంత్రం ప్రైవేటు బస్సు బయల్దేరింది. తిరుపత్తూర్ జిల్లా నాట్రాంపల్లి సమీపం బంగళామేడు ప్రాంతంలో బస్సు వెళ్తుండగా ముందు చక్రం సక్రమంగా తిరగడం లేదని గుర్తించిన డ్రైవర్ అరవిందన్ బస్సు రోడ్డు పక్కగా ఆపి పరిశీలించారు. చక్రానికున్న బోల్టులు ఊడిపోగా, రెండు బోల్టు మాత్రమే ఉన్నట్లు గుర్తించి ఖంగుతిన్నారు. అనంతరం బోల్టులు సరిచేసిన అరవిందన్ అక్కడి నుంచి బయల్దేరాడు. డ్రైవర్ సకాలంలో గుర్తించడంతో 40 ప్రాణాలతో బయటపడ్డారు.

పచ్చయప్పా ట్రస్టు ఇంటర్వ్యూల వ్యవహారం

మద్రాసు వర్సిటీ ప్రొఫెసర్ల తీరుపై హైకోర్టు ఆగ్రహం

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పచ్చయప్పా ట్రస్టు ఆధ్వర్యంలో నడుపుతున్న కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిపే బాధ్యత స్వీకరించి, చివరి క్షణంలో చేతులెత్తేసిన మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు ఉద్దేశ పూర్వకంగానే ఇంటర్వ్యూలు చేసేందుకు వెళ్లలేదని స్పష్టమవుతుందని, ఈ వైఖరిని తాము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హైకోర్టు న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేష్ హెచ్చరించారు. పచ్చయప్పా ట్రస్టు ఆధ్వర్యంలో చెన్నై, కడలూరు నగరాల్లో నడుపుతున్న కళాశాలల్లో 132 అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని ఆ ట్రస్టు నిర్ణయించింది. ఆ మేరకు ఫిబ్రవరి ఒకటిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర కళాశాలల విద్యా మండలి తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసుపై విచారణ జరిపిన హైకోర్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలను పరిశీలించేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వి.పార్తీబన్ నేతృత్వంలో ఓ కమిటీ వేసింది. యూజీసీ నిబంధనల ప్రకారం ఈ ఇంటర్వ్యూలను నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్లను నియమించాల్సి వచ్చింది. ఈ ఇంటర్వ్యూల నిర్వహణ బాధ్యత స్వీకరించేందుకు అన్నామలై విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వవిద్యాలయం నిరాకరించాయి. దీనిని వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో పచ్చయప్పా ట్రస్టు పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై విచారణ జరిగినప్పుడు ఇంటర్వ్యూల నిర్వహణకు మూడు వారాల్లోగా ప్రొఫెసర్లను నియమించనున్నట్లు మద్రాసు విశ్వవిద్యాలయం భరోసా ఇచ్చింది. ఆ వివరాలను నమోదు చేసుకున్న న్యాయమూర్తి డి.భరత్‌చక్రవర్తి కేసు ముగిస్తూ ఆగస్టు 24న ఉత్తర్వు జారీ చేశారు. ఆ మేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఎంపికకు 84 మంది ప్రొఫెసర్లను నియమిస్తూ వారి పేర్లను కూడా మద్రాసు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఇక పచ్చయప్పా ట్రస్టు తాజా నోటిఫికేషన్ ప్రకారం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల తొమ్మిది నుండి 11 వరకు ఇంటర్వ్యూలు జరగాల్సి ఉంది. పచ్చయప్పా ట్రస్టు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధమైన నేపథ్యంలో సోమవారం ఆ ఇంటర్వ్యూలు జరపాల్సిన మద్రాసు విశ్వవిద్యాలయానికి చెందిన 62మంది ప్రొఫెసర్లు ఇంటర్వ్యూలు చేయలేమంటూ ఈమెయిల్ పంపారు. తక్కిన 22 మంది ప్రొఫెసర్లు తాము కూడా రాలేమంటూ పచ్చయప్పా ట్రస్టు నిర్వాహకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో పచ్చయప్పా ట్రస్టు ఇంటర్వ్యూలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఆ నేపథ్యంలో ఆ ట్రస్టు మద్రాసు విశ్వవిద్యాలయం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన పై హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ న్యాయమూర్తి డి.ఆనంద్ వెంకటేష్ ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. ట్రస్టు తరఫున సీనియర్ న్యాయవాది ఓం ప్రకాష్, న్యాయవాది జ్యోతిమణియన్ వాదించారు. ఆ తర్వాత న్యాయమూర్తి మాట్లాడుతూ ఇంటర్వ్యూలు చేసేందుకు మద్రాసు వర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు ఎవరూ వెళ్లకపోవడంతో ఆ ఇంటర్వ్యూలను పరోక్షంగా అడ్డుకోవడమే వారి దురుద్దేశమని స్పష్టమవుతోందన్నారు. ఈ వ్యవహారంపై మద్రాసు వర్సిటీ అధ్యాపకుల సంఘం నిర్వాహకులు మీడియా సమావేశంలో హైకోర్టు ఉత్తర్వులపై విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు చేస్తున్న ఇలాంటి దురుద్దేశపూరిత చర్యలను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, కఠినమైన చర్యలు తీసుకునేందుకు కూడా తాము వెనుకాడబోమని న్యాయమూర్తి హెచ్చరించారు. 84 మంది ప్రొఫెసర్లు ఇంటర్వ్యూలు నిర్వహించడానికి వెళ్లకపోవడం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందకే వస్తుందని, మద్రాసు వర్సిటీ తరఫు న్యాయవాది ఆ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారని, వీలైతే ఆ ప్రొఫెసర్లందరినీ డిస్మిస్ చేయమని, ఆ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ వారంతా హైకోర్టునే ఆశ్రయిస్తారని, వారంతా ఉన్నత న్యాయస్థానానికి విసిరిన పరోక్ష సవాలును ఎదుర్కొనేందుకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఆ తర్వాత పచ్చయప్పా ట్రస్టు కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఎంపికకు ఇంటర్వ్యూలను ఈ నెల 27, 28, 29 తేదీలకు వాయిదా వేశారని, ఆ మూడు రోజులూ మద్రాసు వర్సిటీ ప్రొఫెసర్లు విధిగా హాజరై ఇంటర్వ్యూలు చేసి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేలా వర్సిటీ యాజమాన్యం ఈనెల 25లోపుగా తమకు నివేదిక రూపంలో భరోసా ఇవ్వాలని న్యాయమూర్తి ఉత్తర్వు జారీ చేశారు. కేసు తదుపరి విచారణను కూడా ఆ తేదీకే వాయిదా వేశారు.

టీజే జ్ఞానవేల్ తదుపరి చిత్రం 'జీవజ్యోతి' బయోగ్రఫీ?



'జై భీమ్' ఫేం టీజే జ్ఞానవేల్ తన తదుపరి ప్రాజెక్టుపై హింట్ ఇచ్చారు. ప్రముఖ హోటల్ శరవణ భవన్ యజమాని పి.రాజగోపాల్, ఆయన వద్ద పనిచేసిన జీవజ్యోతి మధ్య జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'దోశ కింగ్' పేరుతో ఇది తెరకెక్కనున్నట్టు కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. 'శరవణ భవన్' స్థాపించిన హోటల్స్.. రాష్ట్రంలోనే ఎంతో పేరుగాంచాయి. ఈ హోటల్స్ ద్వారా పి.రాజగోపాల్ ఎంతో ఎత్తుకు ఎదిగారు. అయితే, జీవజ్యోతిని ప్రేమించడం, ఆ కారణంగా ఏర్పడిన

చిత్రజ్యోతి

మనస్పర్థలతో పి.రాజగోపాల్ నిర్మించుకున్న హోటల్ సామ్రాజ్యం కుప్పకూలిపోవడం, జీవజ్యోతికి, రాజగోపాల్‌కు మధ్య ఉన్న సంబంధం, గొడవలు, ఇతర వివాదాలు, 18 యేళ్ళ న్యాయపోరాటం తర్వాత జీవజ్యోతికి లభించిన విజయం తదితర విషయాలతో ఈ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఈ స్ర్కిప్టును టీజే జ్ఞానవేల్, హేమంత్ రావ్ కలిసి సిద్ధం చేయనున్నారు. పాన్ ఇండియా మూవీగా తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో రూపొందించనున్నారు. ఇదిలావుంటే, సూర్య హీరోగా నటించిన 'జై భీమ్' చిత్రం తర్వాత టీజే జ్ఞానవేల్ ఇపుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా 'వేట్టయన్' చిత్రాన్ని తెరకెక్కించగా వచ్చే నెల 10వ తేదీన విడుదలకానుంది.

నేను ఏదైనా చేయనా?

లింగుస్వామికి రజనీ ఫోన్



రజనీకాంత్, లింగుస్వామి

చెక్ బౌన్స్ కేసులో సినీ దర్శకుడు ఎన్.లింగుస్వామికి కోర్టు ఆరు నెలల జైలుశిక్ష విధించింది. ఈ విషయం తెలుసుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ స్వయంగా లింగుస్వామికి ఫోన్ చేసి.. 'నేను ఏదైనా చేసేదా?' అంటూ అడిగారు. ఈ విషయాన్ని లింగుస్వామి తాజాగా వెల్లడించారు. గతంలో లింగుస్వామి దర్శకత్వంలో వచ్చిన 'ఉత్తమ విలన్' డిజాస్టర్ ఫ్లాప్ సొంతం చేసుకుంది. దీంతో ఆయన ఆర్థికంగా నష్టపోయారు. ఆ తర్వాత 'ఇడమ్ పొరుల్ ఏవల్' అనే సినిమాను లింగుస్వామి తెరకెక్కించారు. అయితే, పీవీపీకి, తిరుపతి బ్రదర్స్‌కు మధ్య ఆర్థిక వివాదం కేసు జరుగుతుంది. పీవీపీ సంస్థ నుంచి తీసుకున్న రుణం తిరిగి చెల్లించే నిమిత్తం ఆ సంస్థకు లింగుస్వామి ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. ఈ వ్యవహారంలో సైదాపేట కోర్టు లింగుస్వామికి ఆరు నెలల జైలుశిక్ష విధించింది. దీన్ని హైకోర్టులో సవాల్ చేయగా అక్కడ కూడా చుక్కెదురైంది. ఈ విషయం తెలుసుకున్న రజనీకాంత్ స్వయంగా లింగుస్వామికి ఫోన్ చేసి... 'నేను ఏమైనా చేయనా? సమస్య ఏంటి? ఎంత మొత్తం ఉంటుంది' అంటూ ఆరా తీశారు. ఆ సమయంలో నేను ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. విచారించడంలో తప్పులేదు. కానీ, ఆ మొత్తం ఎంతో చెప్తే సెటిల్ చేసేద్దాం అని తలైవర్ చెప్పడం జీవితంలో మరచిపోలేని విషయం అని లింగుస్వామి తాజాగా వెల్లడించారు.



తమిళ చిత్రపరిశ్రమలో 'పురట్చి దళపతి'గా గుర్తింపు పొందిన హీరో విశాల్ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 20 యేళ్ళు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఆయన అభిమానులు డిజైన్ చేసిన కామన్ డీపీ.

'ది గోట్' కలెక్షన్ల సునామీ

● 4 రోజుల్లో రూ.288 వసూలు



వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ హీరోగా నటించిన 'ది గోట్' చిత్రం వసూళ్ళపరంగా దుమ్మురేపుతోంది. ఈ సినిమా విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా రూ.288 కోట్ల వసూలు చేసింది. ఇందులో తొలి రోజునే రూ.126.32 కోట్లు వసూలు చేసినట్టు అధికారికంగా ప్రకటించిన నిర్మాణ సంస్థ 4 రోజుల్లో రూ.288 కోట్ల మేరకు కలెక్షన్లు సాధించినట్టు పేర్కొంది. రూ.400 కోట్ల భారీ బడ్జెట్‌తో ఏజీఎస్ సంస్థ నిర్మించింది. అందులో విజయ్, ప్రభుదేవా, ప్రశాంత్, కార్తీక్, స్నేహ, మీనాక్షి చౌదరి ఇలా అనేక మంది నటించారు. ఈ నెల 5వ తేదీ తమిళం, తెలుగు, హిందీ భాషల్లో పాన్ ఇండియా మూవీగా రిలీజైంది. ఇదిలావుంటే, ఈ సినిమాను ఓటీటీలో మూడున్నర గంటల నిడివితో విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. అయితే, ఓటీటీలో రిలీజ్ చేసే తేదీ మాత్రం వెల్లడించలేదు.

యంగ్ డైరెక్టర్ దర్శకత్వంలో నయనతార



యంగ్ డైరెక్టర్ నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సీనియర్ నటి నయనతార నటించనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాణి' అనే టైటిల్ ఖరారు చేశారు. ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ నిర్మించే ఈ చిత్రంలో నటించేందుకు నయనతార కూడా అంగీకరించి ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే, ఇందులో నటించే నటీనటుల వివరాలను వెల్లడించాల్సివుంది. లేడీ ఓరియంటెడ్ కథాంశంతో ఈ సినిమా రూపొందించనున్నారు. కాగా, నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ' చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. అతి తక్కువ బడ్జెట్‌తో రూపొందిన చిత్రం ఏకంగా రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. దీంతో పలువురు స్టార్ హీరోలు, దర్శకులు యువ దర్శకుడిని ప్రశంసల వర్షంలో ముంచెత్తారు. ఈ నేపథ్యంలో ప్యాషన్ స్టూడియోస్ తమ తదుపరి చిత్రాన్ని కూడా ఆయన దర్శకత్వంలోనే నిర్మించేందుకు సిద్ధమైంది.



పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

'ముఖ్యమంత్రి ట్రోఫీ' పోటీలు ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 10: శివగంగలోని జిల్లా క్రీడా మైదానంలో మంగళవారం 'ముఖ్యమంత్రి ట్రోఫీ' క్రీడా పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్, క్రీడాభివృద్ధి శాఖ కార్యదర్శి అతుల్య మిశ్రా, జిల్లా కలెక్టర్ ఆషా ఆజిత్, క్రీడాభివృద్ధి కమిషన్ సభ్యులు, కార్యదర్శి మేఘనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశంలో మంత్రి ఉదయనిధి పాల్గొన్నారు. ముందుగా మంత్రి ఉదయనిధికి శివగంగ జిల్లా సరిహద్దుల్లో డీఎంకే పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు.

ఎస్కేపీసీలో చైతన్య ఇంటర్ కాలేజ్ ఫెస్ట్ ప్రారంభం

ప్యారీస్, సెప్టెంబరు 10: స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ)లో ఐక్యూఏసీ, చైతన్య, కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన చైతన్య మెగా ఇంటర్ కాలేజీయేట్ ఫెస్ట్ 2024-2025 రెండు రోజుల కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బిజినెస్ ప్లాన్, పోస్టర్ మేకింగ్, రీల్ మేకింగ్, లిప్సన్ ఆర్ట్స్, కార్పొరేట్ వార్, ప్రొడక్ట్ ప్యాకేజింగ్ తదితర ఈవెంట్లలో నగరంలోని పలు కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు వివిధ విభాగాల తరఫున ప్రత్యేక పోటీలు నిర్వహించారు. ఇందులో తెలుగు శాఖ సృజన భాషా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యదర్శి శ్రీ లక్ష్మి మోహన్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దేశభక్తి-యువత పాత్ర (పత్ర సమర్పణ), జానపద గేయం-ద్వంద గానం అనే అంశాలపై జరిగిన పోటీల్లో పాల్గొని విజేతలలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు బహూకరించి అభినందించారు. ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ తన స్వాగతోపన్యాసంలో ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, విమర్శనాత్మక ఆలోచనలు వారిలో మెరుగుపరిచేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమ నిర్వహణను తెలుగు అధ్యాపకురాలు డా.పీఎస్ మైథిలి చేపట్టారు. శ్రీ లక్ష్మి మాట్లాడుతూ... మధురమైన మాతృభాష తెలుగు ఎన్నటికీ మరువరాదని హితవు పలికారు. కార్యక్రమంలో డీన్ డా.పి.వనిత, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎంవీ నప్పినై, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.బి.భరణికుమారి, ఎ.నిర్మల తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ, శ్రీలక్ష్మి మోహన్‌రావు, డా.మైథిలి తదితరులు

ఇది ఆధ్యాత్మిక భూమి.. ఎవరూ నాశనం చేయలేరు

● డీఎంకేపై కేంద్రమంత్రి మురుగన్ ధ్వజం



వినాయక విగ్రహాల విసర్జన సభలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆధ్యాతిక భూమి అని, డీకే, డీఎంకే వంటి పార్టీలు ఎంతగా ప్రయత్నించినా నాశనం చేయలేరని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు డీఎంకే పాలకులు అడుగడుగునా అడ్డుకట్ట వేశారని, హిందువులను కించపరిచేలా విమర్శలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇతర మతాల పండుగలకు శుభాకాంక్షలు తెలుపుతూ హిందువుల పండుగలకు ప్రత్యేకించి వినాయక చవితికి శుభాకాంక్షలు చెప్పకుండా హిందూ వ్యతిరేకవాదిగా నిరూపించుకున్నారని విమర్శించారు. కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద వినాయచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం, ఇతర ప్రాంతాల్లోని విగ్రహాల నిమజ్జన ఊరేగింపును మంగళవారం ఉదయం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత హిందూ మున్నని ఆధ్వర్యంలో ఏర్పాటైన వినాయక విగ్రహాల విసర్జన సభలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఒకే రోజు ఆరుహత్యలు జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీధి వీధినా టాస్మాక్ దుకాణాలు తెరిచి ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చిందన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త మహావిష్ణును ఎందుకు అరెస్టు చేశారో పాలకులకే తెలియడం లేదన్నారు కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన నటుడు విజయ్ కూడా రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపకపోవటం గర్హనీయమని మంత్రి మురుగన్ అన్నారు. ఇక 2026లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తుందని ఆయన జోస్యం చెప్పారు.

విజయవంతంగా ముగిసిన 'టెక్ ఎక్స్‌పో2024'



అడయార్, సెప్టెంబరు 10: నగరంలోని శ్రీరామచంద్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐహెచ్ఈఆర్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 'టెక్ ఎక్స్-24' పేరుతో ప్రదర్శన జరిగింది. ఇందులో చెన్నై నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 30 పాఠశాలలకు చెందిన సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, విజ్ఞానాన్ని పెంపొందించేలా ఈ టెక్ ఎక్స్‌పోను నిర్వహించారు. రెండు రోజుల పాటు సాగిన ఎక్స్‌పోలో నెక్స్ జెన్ కోడ్ ఫెస్ట్, బయో క్వెస్ట్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో వంటివి ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన అనేక సైన్స్ ప్రాజెక్టులు వినూత్నమైనవి, నిజ జీవితానికి ఎంతో దగ్గరగా, అనువర్తనాలను కలిగివున్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు సమీప భవిష్యత్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాన్ని యువ భారతీయులు శాసించబోతున్నారని చూపిస్తున్నాయి.



సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్ పంపుతున్న ప్రొఫెసర్ ఖాజారసూల్

వయనాడు బాధితులకు విరాళం

పెరంబూర్, సెప్టెంబరు 10: వయనాడు బాధితులకు న్యూ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్లు విరాళం అందించారు. కేరళ రాష్ట్రం వయనాడులో కొద్దిరోజులు క్రితం కురిసిన భారీ వర్షాలకు. తీవ్ర నష్టం చవిచూసిన వయనాడు బాధితులను ఆదుకొనేలా పలువురు విరాళాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో, న్యూ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్ల ఫోరం తరఫున రూ.1.70 లక్షల విరాళం ప్రకటించారు. విరాళానికి సంబంధించిన చెక్‌ను ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ షేక్ ఖాజా రసూల్, సెక్రటరీ ప్రొఫెసర్ సాహుల్ హమీద్, కోశాధికారి ప్రొఫెసర్ కమాలుద్దీన్‌లు కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించారు.

15న వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపు

● జీపీఎస్‌తో పోలీసుల నిఘా

● అశ్వదళాలతో ముమ్మరగస్తీ

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో చివరి విడత వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపు వేడుకలు ఈ నెల 15న అత్యంత వైభవంగా, భారీ స్థాయిలో జరుగనున్నాయి. అదే సమయంలో ఊరేగింపుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆ మేరకు జీపీఎస్ పరికరాల ద్వారా వినాయక విగ్రహాల ఊరేగింపు వేడుకలపై తీవ్ర నిఘా వేయనున్నారు. అదే సమయంలో ఈ వేడుకలకు పోలీసులు అశ్వదళాలను కూడా రంగంలోకి దింపటానికి సిద్ధమవుతున్నారు. వినాయక చవితి సందర్భంగా నగరంలోను, శివారు ప్రాంతంలో 1519 భారీ వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు అనుమతిచ్చారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఈ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను రెండు విడతలుగా ఈ నెల 14, 15 తేదీల్లో జరుపనున్నారు. ఈ నిమజ్జన ఊరేగింపులకు 16500 మంది పోలీసులు 2000లకు పైగా హోంగార్డులతో భద్రత కల్పిస్తున్నారు. కన్వేయర్ బెల్ట్ క్రేన్లు, మరపడవలను ఉపయోగించి సముద్రతీరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పోలీసులు ప్రస్తుతం ఏర్పాట్లను కూడా చేపడుతున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ఫైరింజన్లు, అంబులెన్స్‌లను కూడా సిద్ధం చేస్తున్నారు.

జీఆర్‌టీ 'డైమండ్ ఇయర్ రింగ్స్ మేళా'కు విశేష స్పందన



చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల రంగంలో ప్రసిద్ధి చెందిన జీఆర్‌టీ జ్యూవెలర్స్ షోరూంలో జరుగుతున్న 'డైమండ్ ఇయర్ రింగ్స్ మేళా'కు విశేష స్పందన లభిస్తోంది. ఇది ఏ సందర్భానికైనా సరిపోయే వినూత్నమైన డైమండ్ ఇయర్ రింగ్స్ అద్భుతమైన డిజైన్లలో ఉన్నాయి. డైమండ్, అన్‌కట్, పోల్కీ డైమండ్ విలువపై ఫ్లాట్ 15 శాతం తగ్గింపుతో డైమండ్ ఇయర్ రింగ్స్, టైంలెస్ ఆభరణాల విస్తృత సేకరణ పొందడానికి ఇది చక్కని అవకాశమని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 1964లో స్థాపించిన జీఆర్‌టీ జ్యూవలర్స్ నాణ్యత, విశ్వసనీయత పట్ల నిబద్ధత కారణంగా దక్షిణభారతదేశంతో పాటు సింగపూర్‌లోనూ అగ్రభాగాన రాణిస్తోంది.

ఘనంగా ఎయిర్ కార్గో వార్షికోత్సవం



వార్షికోత్సవంలో టీటీ గ్రూప్ ఎండీ అరుణ్‌వాసు, నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 10: నగరానికి చెందిన ఎయిర్‌కార్గో దిగ్గజం లాజిస్టిక్స్ టీటీ గ్రూప్ 40వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గోపాలపురంలోని ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరుపుకున్న వార్షికోత్సవంలో టీటీ గ్రూప్ ఎండీ అరుణ్‌వాసు మాట్లాడుతూ...ఎయిర్‌కార్గోలో రూ.600 కోట్ల ఆదాయమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. భవిష్యత్ ప్రణాళిక, యూరప్, యూఎస్ తదితర దేశాల్లో తమ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆయన తెలిపారు. గత 40 సంవత్సరాల ప్రయాణం సంతోషకరమైనదని, ఎప్పటికప్పుడు మారుతున్న ల్యాండ్ స్కేప్‌ను విజయవంతంగా నావిగేట్ చేయడానికి ప్రత్యేక నిపుణుల బృందాలను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు.

మహిళకు కొత్త జీవితాన్ని ప్రసాదించిన సవీత డెంటిస్టులు

అడయార్, సెప్టెంబరు 10: నగరంలోని ప్రముఖ దంత వైద్య కళాశాల సవీత డెంటల్ హాస్పిటల్ వైద్యులు ఓ మహిళకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. 47 యేళ్ళగా మాట్లాడలేకుండా, ఘన పదార్థాల ఆహారం తీసులేకపోవడం, నమలలేకపోవడం వంటి సమస్యలతో బాధపడిన 49 యేళ్ళ మహిళకు ఈ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ విజయవంతంకావడంతో ఇపుడు ఆ మహిళ మాట్లాడటం, ఆహారాన్ని నమిలి మింగగలుగుతుంది. చీఫ్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మురుగేశన్, అసిస్టెంట్ డాక్టర్లు లావణ్య, డాక్టర్ గౌతం విజయకుమార్ తదితరులతో కూడిన వైద్య బృందం ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసింది. బాధిత మహిళకు ముఖ ఎముకల్లో కరోనాయిడ్ ప్రక్రియ అధికంగా పెరుగుదల కారణంగా కరోనాయిడ్ ఇంపింగ్‌మెంట్ సిండ్రోమ్ అనే అరుదైన పరిస్థితిలో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ సమస్యకు అరుదైన అపరేషన్‌తో చెక్ పెట్టారు. ఆరేషన్‌కు ముందు కేవలం 19 కేజీల బరువున్న ఆ మహిళ ఆపరేషన్ చేసిన మూడు నెలల తర్వాత 30 కేజీల బరువు పెరగడంతో పాటు మాట్లాడటం, ఘన ఆహారం తీసుకోవడం జరుగుతుందని డాక్టర్ కె.మురుగేశన్ వెల్లడించారు.

రూ.5కోట్ల విలువైన చిన్నికృష్ణుడి విగ్రహం

● కుంభకోణం ప్రత్యేక కోర్టుకు అప్పగింత

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల క్రితం అంతర్జాతీయ స్మగ్లర్లు అమెరికాకు తరలించగా, ఇంటర్‌పోల్ సహకారంతో స్వదేశానికి తీసుకొచ్చిన రూ.5 కోట్ల విలువైన చిన్ని కృష్ణుడి విగ్రహాన్ని విగ్రహాల అక్రమరవాణా నిరోధక విభాగం అధికారులు మంగళవారం ప్రత్యేక కోర్టుకు అప్పగించారు. రాష్ట్రంలో చోళుల కాలంనాటి కలియుగ కల్కి, కాళియమర్ధన కృష్ణుడు పంచలోహ విగ్రహాన్ని స్మగ్లర్లు విదేశాలకు తరలించారు. ఆ విగ్రహం అమెరికాలోని అక్కడి భద్రతా విచారణ సంస్థ ఆధీనంలో ఉన్నట్లు రాష్ట్ర విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం అధికారులకు తెలిసింది. ఆ విగ్రహాన్ని అంతర్జాతీయ స్మగ్లర్ సుభాష్ చంద్ర కపూర్ నుంచి థాయ్‌లాండ్‌కు చెందిన డగ్లస్ లాచ్‌ఫోర్డు అనే వ్యక్తి రూ.5 కోట్లకు కొనుగోలు చేశారు. ఆ విగ్రహాన్ని కొన్న డగ్లస్ 2020లో మృతిచెందారు. ఈ సమాచారమంతా విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం ఉన్నతాధికారులు సేకరించారు. ఆ తర్వాత ఆ విగ్రహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఆ విభాగం ఐజీ దినకరన్ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పురావస్తు పరిశోధన విభాగం అధికారుల సాయంతో చర్యలు చేపట్టారు. ఈ విషయమై ఇంటర్‌పోల్ సాయం కూడా కోరారు. ఆ నేపథ్యంలో అమెరికా సంస్థ ఆ విగ్రమాన్ని 2023 నవంబర్ 11న థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ ప్రభుత్వ అధికారులకు అప్పగించారు. థాయ్‌లాండ్ ప్రభుత్వ అధికారులతో అక్కడి భారత రాయబార కార్యాలయ అధికారులు చర్యలు చేపట్టడంతో జూన్ 25న ఆ విగ్రహం కేంద్ర పురావస్తు పరిశోధన విభాగం కార్యాలయానికి తరలించారు. అనంతరం ఆ విగ్రహాన్ని విగ్రహాల అక్రమరవాణా నిరోధక విభాగం అధికారులకు అప్పగించారు. ఆ విభాగం ఏడీఎస్పీ బాలమురుగన్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు నడుమ ఆ విగ్రహాన్ని కుంభకోణం ప్రత్యేక కోర్టులో మంగళవారం ఉదయం అప్పగించారు. కోర్టు ఉత్తర్వు మేరకు ఈ విగ్రహాన్ని ఇప్పటివరకూ కుంభకోణం నాగేశ్వరన్ ఆలయంలోని లోహ తిరుమేని సంరక్షణ కేంద్రంలో భద్రపరిచారు.



కాళియమర్ధన చిన్ని కృష్ణుడి విగ్రహం

చెన్నై, స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రిలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఉద్యోగులు, సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న మేయర్ ఆర్.ప్రియ





చెన్నై, చీట్లపాక్కంలో వినాయక చతుర్థి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల ప్రదర్శనను మంగళవారం ఆసక్తిగా వీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

వేలూరు పాత కాట్పాడిలో ప్రసిద్ధి చెందిన కోట మారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం



సందర్భంగా రెండు రోజుల అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త ఏజే శేఖర్, కౌన్సిలర్ శ్రీనివాసన్ తదితరులు